సాక్షి
వికారాబాద్
శుక్రవారం ￨ 19 ￨ జూలై ￨ 2024



పంచాయతీల్లో పైసల్లేక..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. 8లో ▸



'గీత' నేర్చుకో రాత మార్చుకో

ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం అలవర్చుకోవాలని గీతావాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి సూచించారు. 8లో ▸



పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. 9లో ▸

న్యూస్‌రీల్

టెండర్ల ఆహ్వానం

అనంతగిరి: జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన అన్ని ఔట్ సోర్సింగ్ సర్వీసుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ అయిన ఏజెన్సీల నుంచి సీల్ టెండర్లు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లను ఈ నెల 26లోపు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన టెండర్లను ఈ 20 నుంచి 26వ తేదీ సాయంత్రం 3గంటల వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏజెన్సీల సమక్షంలో టెండర్లను తెరవడం జరుగుతుందన్నారు. టెండర్ ఫారాలు, ఇతర సమాచారం కోసం జిల్లా ఉపాధి కల్పనాధికారి సెల్ నంబర్ 9177607016లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎంపీ కొండాకు పౌరసన్మానం

తాండూరు: పట్టణంలోని సాయిపూర్ తులసీ గార్డెన్‌లో శుక్రవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాహు శ్రీలత, బాలప్ప, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, సీనియర్ న్యాయవాది మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఆర్టీసీ డీఎంగా అరుణ



అనంతగిరి: వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జి.అరుణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇదివరకు బస్‌భవన్‌లో విధులు నిర్వహించి ఆమె ప్రమోషన్‌పై వికారాబాద్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన భిక్షి నాయక్ ఉప్పల్ డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎం అరుణ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. సిబ్బంది సమన్వయంతో డిపో అభ్యున్నతికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మీర్‌పేట డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన డిప్యూటీ మేయర్‌పై గత నెల 24న బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖను అందజేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 11 గంటలకు ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అవిశ్వాసం నెగ్గడానికి 31 మంది సభ్యులు అవసరం ఉండగా, బీజేపీకి 21 మంది, కాంగ్రెస్‌కు 11, బీఆర్ఎస్‌కు 14 మంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: ఈఎంఆర్ఐ (108) సంస్థలో ఈఎంటీ ఉద్యోగాల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ప్రోగ్రాం జిల్లా మేనేజర్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ(బీజెడ్సీ), బీఎస్సీ నర్సింగ్,జీఎన్ఎం,ఏఎన్ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ చదివి 30 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20న సరూర్‌నగర్‌లోని 108 జిల్లా కార్యాలయంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకుని రావాలన్నారు. ఇతర వివరాలకు 91007 99167 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

మొయినాబాద్: జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే 'ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో' పోస్టర్‌ను మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగే ఎక్స్‌పోలో జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్స్‌పోలో తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, కోశాధికారి మల్లేశ్, సభ్యులు విష్ణుగౌడ్, బాలు, రంజిత్‌గౌడ్, మహేష్, శ్రీశైలం, మాణిక్‌రెడ్డి, రవితేజ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రూ. 256.26 కోట్లు మాఫీ

రుణమాఫీ డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేయాలి

- అన్నదాతలను ఇబ్బంది పెట్టొద్దు
- బ్యాంకర్లకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన



అనంతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అనంతగిరి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రైతు రుణమాఫీ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రకటించారు. గురువారం కలెక్టరేట్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతగా రూ.లక్షలోపు రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్ల రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు. అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో రుణమాఫీ డబ్బు జమ చేయాలన్నారు. ప్రతి రైతు వేదికలో రుణమాఫీ రైతుల జాబితా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు. జాబితాలో పేర్లు లేని రైతులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రుణమాఫీ సహాయ కేంద్రంలో గానీ, టోల్ ఫ్రీ నంబర్ల 9989291049 , 9000470989లో గానీ సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎల్‌డీఎం యాదగిరి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ పల్లం రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కో ఆపరేటివ్ బ్యాంక్, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికీ రుణమాఫీ అమలు చేస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. పంట రుణాలు తీసుకున్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ అవుతుందన్నారు. మొదటి విడతలో రూ. లక్షలోపు ఉన్న వారికి మాఫీ అయ్యిందన్నారు. రైతులు తిరిగి రుణం పొందాలంటే ఫాం 1బీ, ఫొటోలు, ఆధార్ కార్డు, పాసు పుస్తకంతో బ్యాంకులకు వెళ్లాలని సూచించారు. రుణాల మాఫీలో సందేహాలు ఉంటే ప్రతిరోజు రైతు వేదికలో అందుబాటులో ఉండే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఒక కుటుంబంలో ఎంత మందికి పట్టాదారు పాసు పుస్తకాలు ఉంటే వారందరికీ రుణమాఫీ అవుతుందని తెలిపారు. రూ.2 లక్షలకు మించి ఉంటే ఆపై మొత్తాన్ని రైతులు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అప్పుడే పథకం వర్తిస్తుందని వివరించారు. బ్యాంకర్లు ఎట్టి పరిస్థితిలో రుణమాఫీ డబ్బును ఇతర ఖాతాల్లోకి మళ్లించరాదని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి, డీఏఓ గోపాల్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, వ్యవసాయాధికారి జయశంకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ యాదగిరి, ఏఈఓలు పెంటయ్య, మౌనిక, చంద్రిక, నాయకులు శంకర్, మహేందర్‌రెడ్డి, సిరాజొద్దీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై హర్షం

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించిన రైతులు



పర్సాపూర్‌లో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు, రైతులు, నాయకులు

కొడంగల్ రూరల్: మండలంలోని పర్సాపూర్‌లో రైతు నేస్తంలో భాగంగా గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్నదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రుణమాఫీపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కొడంగల్ మండలాలకు చెందిన 9,604 మంది రైతులకు రూ. 53,95,20,855లు రుణమాఫీ జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, నాయకులు ప్రశాంత్ కుమార్, కృష్ణంరాజు, బస్వరాజు, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అంజాద్, బాల్‌రెడ్డి, భాస్కర్, తహసీల్దార్ విజయకుమార్, ఏడీ శంకర్ రాథోడ్, ఏఈఓలు పాల్గొన్నారు



అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎత్తిపోతల పనుల్లో వేగం పెంచండి

- అధికారులకు దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొడంగల్‌లో చేపల మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం

కొడంగల్: కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. పనుల్లో వేగం పెంచాలని, ప్రాజెక్టు పురోగతిపై ఇక నుంచి ప్రతి నాలుగు వారాలకు ఒకసారి సమీక్ష ఉంటుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలోని సాగునీటి చెరువుల సామర్థ్యం రెట్టింపు చేసినట్లు తెలిపారు. సాగునీటి నిల్వ కెపాసిటీని పెంచి ఆయకట్టును విస్తరించినట్లు చెప్పారు. ఇందుకు తగినట్లుగా అన్ని చెరువులను ఆధునీకరించాలన్నారు. ప్రతి చెరువులో చేపల పెంపకానికి ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో చేపల మార్కెట్ ఏర్పాటు చేయడం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దూరు మండలంలో రెసిడెన్షియల్ క్యాంపస్ నిర్మాణంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్యాంపస్ నిర్మాణం కోసం అధికారులకు సలహాలు సూచనలు చేశారు. సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో పాటు కొడంగల్ కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం: ఆశ వర్కర్లకు 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ (క్యాంపు కార్యాలయం) ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 వేల మంది ఆశా వర్కర్లు 19 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలోని గర్భిణులు, బాలింతలు, పేదలకు ఆరోగ్య భద్రత సేవలు అందిస్తున్నారని తెలిపారు. పారితోషికం కాకుండా ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ప్రమాద బీమా రూ.50 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు



గుంతలమయంగా వికారాబాద్ - సదాశివపేట రోడ్డు

రోడ్లు.. వర్షార్పణం

వానలకు దెబ్బతిన్న ప్రధాన రహదారులు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- గంట ప్రయాణానికి రెండు గంటల సమయం
- తరచూ ప్రమాదాలు
- నిద్రావస్థలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు

వికారాబాద్: వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నా నిధులు మంజూరైన దాఖలాలు లేవు. గతేడాది వరుస వర్షాల కారణంగా లాభాల కంటే నష్టాలనే ఎక్కువగా చూడాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా అనేక రహదారులు పాడయ్యాయి. మరమ్మతులు విస్మరించారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించడం లేదు. ఈ ఏడాది వర్షాలకు రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. అధికారులు దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరిస్తున్నారే తప్ప తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు.

టెండర్ ప్రక్రియతో సరి

గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్అండ్‌బీ రోడ్ల బాగు కోసం ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా వ్యాప్తంగా 198 కిలో మీటర్ల మేర రోడ్లు పాడైనట్లు అధికారులు గుర్తించారు. వీటిని పూర్తి స్థాయిలో బాగు చేసేందుకు రూ.89 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. నిధులు మంజూరయ్యే లోపు తాత్కాలిక మరమ్మతులు చేయాలని భావించారు. ఇందు కోసం రూ.8 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనాకు వచ్చారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 98 కిలో మీటర్ల మేర పాడైన రోడ్లకు రూ.39 కోట్లు మంజూరు చేసింది. ఇక పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు రూ.20 కోట్లు విడుదల చేశారు. అయితే టెండర్ల ప్రక్రియ వద్దే పనులు ఆగిపోయాయి.

ఒకటి రెండు మినహా..

జిల్లాలోని ఒకటి రెండు రోడ్లు మినహా మిగిలిన రహదారులన్నీ అధ్వానంగా మారాయి.వికారాబాద్- పరిగి, వికారాబాద్ - నవాబుపేట,వికారాబాద్- బుగ్గదేవాలయం వెళ్లే దారి, వికారాబాద్ – తాండూరు, కొడంగల్- తాండూరు, కొడంగల్ – మహబూబ్‌నగర్, పరిగి- మిట్టకోడూర్, దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి – గొడుగోనిపల్లి, ఐనాపూర్- పాలెపల్లి, గడిసింగాపూర్ – మల్లెపల్లి, వికారాబాద్ – సదాశివపేట్, కోటాలగూడ – లాల్‌సింగ్ తండా, మన్నెగూడ- మిర్జాపూర్ మీదు గా లల్‌సింగ్ తండా,వికారాబాద్-దామగుండ రోడ్లన్నీ పాడయ్యాయి. ఈ మార్గాల్లో రాక పోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గంట ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతోందని పలువురు పేర్కొన్నారు.అంతేకాకుండా తరచూ ప్రమాదాలు చెటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అధికం.. అనర్థం

- మోతాదుకు మించి ఎరువులు వాడితే ముప్పేనంటున్న అధికారులు
- సేంద్రియ సాగు పెంచాలని సూచన

నవాబుపేట: మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తే అనర్థమే అని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా దిగుబడులు తగ్గుతాయని, పెట్టుబడులు కూడా పెరుగుతాయని అంటున్నారు. సాధారణంగా నేల స్వభావం, భూసారాన్ని బట్టి ఎరువులను వినియోగించాలని సూచిస్తున్నారు. కానీ రైతులంతా ఒకే రకమైన ఎరువులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా రైతు చైతన్య సదస్సుల్లో అధికారులు సాగుపై ప్రాథమిక సమాచారం ఇవ్వకపోవడంతో రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నట్లు తెలుస్తోంది. వరి సాగులో ఎకరాకు 50 కేజీల డీఏపీ, 100 కేజీల యూరియా వాడాల్సి ఉండగా రైతులు రెండు బస్తాలకు తగ్గకుండ డీఏపీ వాడుతున్నారు. వరి పైరు నాటే సమయంలో బస్తాకు అదనంగా 25 కేజీల పొటాస్‌ను కలిపి వేయాల్సి ఉన్నా ఈ పద్ధతి పాటించడం లేదు. వరి పంట వేసిన రైతులు నాలుగు సార్లు యూరియా వాడాలి. వాడిన ప్రతి సారి 30 కేజీల చొప్పున వేయాలి. పొట్ట దశలో యూరియాకు 25 కేజీల పొటాష్‌ను కలిపి వాడాలి. అయితే రైతులు చాలా వరకు నాటిన 20 రోజులకు 50 కేజీలు, మధ్యలో 50 కేజీలు వాడుతున్నారు.

పత్తి సాగులో..

పత్తి పంట విషయానికి వస్తే విత్తేకంటే ముందే ఎకరాకు మూడు నాలుగు అంగుళాల లోతున పడేలా 50 కేజీల డీఏపీ వాడాలి. వర్షాధారంగా సాగు చేసే పంటల్లో మొలుస్తాయో లేదోనని పత్తి విత్తేటప్పుడు ఎరువులు వేయడం లేదు. కనీసం 25 సెంటీమీటర్ల లోతులో భూమిలో పదును ఉండేలా వర్షం పడినప్పుడు ఎరువుతో పాటు పత్తి గింజలు వేస్తే మంచి ఫలితం ఉంటుందని అధికారులు అంటున్నారు. పత్తి తోపాటు అన్ని ఖరీఫ్ పంటలకు 50 కేజీల వరకు మాత్రమే డీఏపీ వాడాలి. అయితే రైతులు పైరు ఎదుగుదల దశలో రెండు నుంచి మూడు బస్తాలు వరకు పై పాటుగా జల్లుతున్నారు. దీని వల్ల అంతగా ప్రయోజనం ఉండదని అధికారులు తెలిపారు. పోషకాలున్న కాంప్లెక్స్ ఎరువులు రెండు బస్తాలు వాడితే సరిపోతుందని సూచిస్తున్నారు.

సమతుల్యత ఏదీ?

ప్రతి మొక్కకు నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువుల తోపాటు సూక్ష్మపోషకాలు కూడా అవసరం. అవగాహన లోపంతో రైతులు కొన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల్లో ఉండని పోషకాలను అదనంగా చేర్చి వాడాల్సిన విషయం వారికి తెలియడం లేదు. ఉదాహరణకు 28-28-0, డీఏపీలోను పొటాష్ ఉండదు. ఈ ఎరువులు వినియోగించినప్పుడు పైరు ఎదుగుదల దశలో పైపాటుగా యూరియాను వాడాలి. దుక్కిలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచిస్తున్నా పైపాటుగా కూడా వాడుతుండటంతో ఎరువుల్లో పోషకాలు సరిగ్గా మొక్కకు చేరక వృథా అవుతున్నాయి. సూక్ష్మపోషకాల అవసరాన్ని రైతులు గుర్తించకపోవడంతో పంటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి.

ఎక్కువ భాస్వరంతో నష్టం

అధిక మోతాదులో భాస్వరం వాడితే దిగుబడులపై ప్రభావం చూపుతుంది. తొలి ఏడాది, మరో రెండేళ్ల పాటు దిగుబడులు బాగా వచ్చినా ఆ తర్వాత ఎరువులు వాడినా దిగుబడులు రానంతగా నేల దెబ్బతింటుందని అధికారులు పేర్కొన్నారు. భాస్వరం భూమి లోపలి పొరల్లో నిల్వ ఉండి నేల గట్టిగా మారి పంటలకు నష్టం కలిగిస్తుందని తెలిపారు.

సేంద్రియ ఎరువులు తప్పనిసరి

సాగులో రసాయన, సేంద్రియ ఎరువులు సగం మోతాదులో వాడాల్సి ఉంది. కేవలం రసాయన ఎరువులే వాడటం వల్ల భూమిలో సారం తగ్గిపోయి భూమి నిస్సారంగా మారుతుంది. మొదట్లో బాగానే దిగుబడులు వచ్చినా క్రమంగా భూమి సారం తగ్గి దిగుబడులు రావు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల బరువు నేలలు గుళ్ల బారి వేర్లు చక్కగా పెరగటానికి సహాయపడుతుంది.



అవగాహన కల్పిస్తాం



మోతాదుకు మించి ఎరువులు వాడటం వల్ల నష్టం జరుగుతుంది. ఏ సమయంలో పైరుకు ఎంత మోతాదులో ఎరువు అవసరమో రైతులకు సూచిస్తాం. భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తాం. రైతులు అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

– లక్ష్మీప్రసన్న, ఏఓ, నవాబుపేట

హరీశ్.. రాజీనామా చేసి మాట నిలుపుకో

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి డిమాండ్
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఆగస్టు 15లోపు రుణమాఫీ అమలు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు మాట నిలుపుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ వేడుకల్లో భాగంగా గురువారం పట్టణంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గడి సింగాపూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేసిందని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణ మాఫీ చేసిందన్నారు. ఈ అంశంపై సవాలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రుణమాఫీ జరిగిందని, ప్రస్తుతం కూడా కాంగ్రెస్ హయాంలోనే రుణమాఫీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్లు తదితర హామీలు నిరాటంకంగా అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, సీనియర్ నాయకులు పార్థసారథి, చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధికి నిధులు కేటాయించండి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ దంపతులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆమెతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్పీ

అనంతగిరి: మోమిన్‌పేట పీఎస్‌లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు బల్వంత్ కుటుంబానికి జిల్లా హోంగార్డులు అండగా నిలిచారు. తమవంతు సహాయంగా కొంత నగదును ఎస్పీ నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఇందులో ఆర్‌ఐ డేవిడ్, విజయ్, హోంగార్డు జిల్లా అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చాంద్‌పాషా, హోంగార్డులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. కార్మికులకు గాయాలు


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న కార్మికులు

తాండూరు రూరల్: ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి మరో లారీ బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌతపూర్ గేటు వద్ద గురువారం ఉదయం 9 గంటలకు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి నాపరాతి బండల లోడ్‌తో వెళ్తున్న మరో లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలోని బెల్కటూర్ గ్రామానికి చెందిన కార్మికులు స్వామి, లింగప్ప, పరశురాం, రాములుకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్వామి తలకు తీవ్రగాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తలించారు. లారీ డ్రైవర్ సైదులుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఎప్పుడు రద్దీగా ఉండే గౌతపూర్ చౌరస్తా వద్ద ప్రమదం జరిగిన సమయంలో ఏ వాహనం రాకపోవడం, జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కూడలి వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితులకు ఫోన్లు అందజేసిన పోలీసులు

నవాబుపేట: వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ (సీఈఐఆర్) ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించామని నవాబుపేట ఎస్‌ఐ భరత్‌భూషణ్ తెలిపారు. నెల రోజుల క్రితం వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు తమ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు తమకు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వారి వివరాల ఆధారంగా ఫోన్లను గుర్తించామన్నారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు గురువారం అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

22న షార్జా-అసోచామ్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: షార్జా ప్రభుత్వంతో కలిసి నగరానికి చెందిన అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ - ఇండస్ట్రీ సహకారంతో ప్రత్యేక బీ2బీ సమావేశాన్ని ఈ నెల 22న బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని అసోచామ్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార ప్రోత్సాహకాలు, సున్నా పన్నులు, వేగంగా కంపెనీ రిజిస్ట్రేషన్ మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, రష్యా, ఐరోపాలో వ్యూహాత్మక మార్కెట్ చేరుకోవడం వంటి లక్ష్యాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలలో అవగాహన పెంచడానికి, ప్రపంచ వ్యాప్తంగా వారి వ్యాపారాలను విస్తరించడానికి ఈ భేటీ ఉపకరిస్తుందన్నారు.

పంచాయతీల్లో పైసల్లేక..

దేశానికి పట్టుగొమ్మలు పల్లెలు. అవి అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం. కానీ అలాంటి గ్రామాలు నేడు పాలకుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధి కుంటుపడి సమస్యలు పేరుకుపోతున్నాయి. పట్టించుకునే వారు కరువై.. కనీస అవసరాలకు నోచుకోని దుస్థితికి చేరాయి. ఏడాది ప్రారంభం నుంచి మెజారీ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో.. చెత్తచెదారం పేరుకుపోయి అపరిశుభ్రత వాతావరణం నెలకొంది.


హస్నాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట జీతాల కోసం నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

- సమస్యల తిష్ట, కుంటుపడిన అభివృద్ధి
- వేతనాలు అందక.. పారిశుద్ధ్య కార్మికుల వెతలు
- అపరిశుభ్రతతో కళతప్పిన పల్లెలు

దుద్యాల్: పంచాయతీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సమకూరక పోవడం, 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు రాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. గడిచిన ఆరు నెలలుగా మండల పరిధి అన్ని గ్రామాలకు నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చిన్నచిన్న పనులు చేయడానికి అప్పులు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. పంచాయతీ కార్మికులకు 8 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు విధుల్లోకి రావడానికి ఆసక్తి చూపడం లేదని, తద్వారా పారిశుద్ధ్యం లోపించిందని వెల్లడించారు.

చుట్టపు చూపుగా..

చెత్తచెదారం పేరుకుపోయి.. మురుగు కాలువలు ముందుకు సాగక దోమలు వృద్ధి చెందుతున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మండల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను నియమించారని, వారు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారే తప్ప.. గ్రామ సమస్యలు పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు.


హస్నాబాద్ మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

కార్యదర్శులపై భారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక ఇబ్బంది పడుతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో నీటి సరఫరా బోర్లు కాలిపోవడం, పైపులైన్ల మరమ్మతుల వంటి పనులకు సొంత డబ్బు వెచ్చించడమో, అప్పులు చేసి చేయించడమో చేస్తున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు చిన్న పంచాయతీల్లో రూ.60 వేలు, పెద్ద పంచాయతీల్లో రూ.1లక్ష వరకు ఖర్చు చేసినట్లు వెల్లడిస్తున్నారు. చిన్న పనులకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా పరిష్కరించాల్సి వస్తుందని, లేదంటే పై అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిధుల విడుదలకు కృషిచేసి, పల్లెల సమస్యలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల ఇక్కట్లను తీర్చాలని కోరుతున్నారు.

గీత నేర్చుకో.. తల రాత మార్చుకో

గీతావాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

అనంతగిరి: భగవద్గీతా పారాయణం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని గీతావాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. గీతావాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా వికారాబాద్ పట్టణంలోని ఆయా దేవాలయాల్లో కొనసాగుతున్న సామూహిక గీతా పారాయణం గురువారం పట్టణంలోని మారుతినగర్ వైభవలక్ష్మి ఆలయంలో ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా అమ్మవారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సామూహిక భగవద్గీత పారాయణం ప్రారంభించారు. వందల మంది మహిళలతో గీతాలపన చేయడంతో ఆ ప్రాంతమంతా భక్తి పరవశం సంతరించుకుంది. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

హిందూ ధర్మ రక్షణకు పాటుపడండి

సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను రూపు మాపేందుకు భగవద్గీత మాత్రమే సమాధానంగా నిలుస్తుందని శ్రీదేవి అన్నారు. పట్టణంతో పాటు చుట్టూ పక్క గ్రామాల్లో సైతం భగవద్గీత పారాయణం చేస్తున్నామని తెలిపారు. అన్ని వాడల్లో పెద్దలకు, పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి గీతా నేర్పిస్తామని ఆమె వెల్లడించారు.


వైభవలక్ష్మి ఆలయంలో సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న గీతావాహిని బృందం

మానసిక ప్రశాంతతో ఉండాలంటే ప్రతి వ్యక్తి గీతా పారాయణం చేయాలని సూచించారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, వైభవలక్ష్మి ఆలయ నిర్వాహకురాలు స్వరూప, గీతా వాహిని ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, సభ్యులు వరలక్ష్మి, ఝాన్సీ, మాధురి, లక్ష్మి, విజయ, సంజీవరాణి, సరళ, సునీత, జ్యోతి, నాగరాణి, అనురాధ, కరుణ, శిరీష, సరిత, రంజిత, సంతోష, గీతావాహిని బృందం, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నక్షబాట పరిశీలన

బంట్వారం: కోట్‌పల్లి మండలం బీరోల్ గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ ఉమా హారతి గురువారం సందర్శించారు. నక్షా బాటను ఆక్రమిస్తున్నారంటూ ఇటీవల ప్రజావాణిలో గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె గ్రామానికి వెళ్లి.. స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఫిర్యాదులో పేర్కొన్న బాటను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట కోట్‌పల్లి తహసీల్దార్ ఆశాజ్యోతి, సర్వేయర్ రమేష్ తదితరులు ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఉమా హారతి

వైద్యశాలకు తాళం!

బొంరాస్‌పేట: పశువైద్యశాలకు తరచుగా తాళం వేస్తుండటంతో మూగజీవాలకు వైద్యం అందడం లేదని పశు, జీవాల కాపరులు అన్నారు. మండల పరిధి బోరబండతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ గురువారం తన మేకపిల్లకు వైద్యం అవసరమై మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లగా.. తాళం వేసి ఉంది. మధ్యాహ్నం వరకు వేచిచూశాడు. ఎంతకూ వైద్యులు, సిబ్బంది రాకపోవడంతో నిరాశతో వెనుతిరిగాడు. సంబంధిత అధికారులు స్పందించి పశు వైద్యశాల నిత్యం తెరచి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పశు వైద్యశాల వద్ద మేకతో కాపరి

ప్రేమ పేరుతో బాలికపై అఘాయిత్యం

పోలీసుల అదుపులో నిందితుడు

మీర్‌పేట: ప్రేమ పేరుతో ఓ యువకుడు బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేటకు చెందిన రాకేష్ అలియాస్ రింకు(24) స్థానికంగా పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. సమీపంలో బిహార్ నుంచి ఓ కుటుంబం బతుకుదెరువు కోసం వచ్చి ఇక్కడే ఉంటుంది. రాకేష్, బాధిత బాలిక(15) కుటుంబాలు ఒకే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాయి. ఈ క్రమంలో రాకేష్ ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకొని కొంత కాలంగా లైంగిక దాడికి పాల్పడడంతో ఆమె గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురువారం బాలికను నిలదీయడంతో జరిగిన విషయం వెల్లడించింది. దీంతో బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాకేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నిందితుడు రాకేష్

కారు ఢీకొని.. బాలుడికి గాయాలు

మొయినాబాద్: ఇంటి ముందు ఆడుకుంటున్న రెండేళ్ల బాలుడిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగింది. ఈ సంఘటన మండల పరిధి హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన నరేష్ కుమారుడు నిక్షిత్(2) గురువారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న తమ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు.. బాలున్ని ఢీకొట్టింది. దీంతో అతడి కాలు విరిగింది. వెంటనే బాలున్ని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఘటన అనంతరం డ్రైవర్ కారు ఆపకుండా పరారయ్యాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్

- పట్టాభూమిలో అనుమతి లేకుండా తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

తాండూరు రూరల్: పట్టా, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు బరితేగిస్తున్నారు. అడ్డూఅదుపు లేకుండా నాపరాతిని గనులను కొల్లగొడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారు. తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామ శివారులో సర్వే నంబర్ 110లో సాగు భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు తవ్వకాలు చేపట్టారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పొంది, నాపరాతి గనులను కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో వెలువడిన వ్యర్థాలను (నాప రాతి ముక్కలు) ప్రభుత్వ భూమిలో డంపింగ్ చేస్తున్నారు.

పేదల భూమిలో..

రెవెన్యూ నుంచి ఎన్‌ఓసీ, మైనింగ్ శాఖ నుంచి లీజు తీసుకోకుండా, అక్రమంగా విద్యుత్ సరఫరాతో వ్యాపారం చేస్తున్నారు. మరో వైపు సంగెంకలాన్ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 109లో పేదలు జీవనోపాధి పొందేందుకు అప్పట్లో ప్రభుత్వం రైతులకు భూములను ఇచ్చింది. రైతులకు డబ్బు ఆశ చూపి ఈ భూములను కొల్లగొడుతున్నారు. ఇద్దరు వ్యక్తులు ఓ పేద రైతు నుంచి 2 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, యథేచ్ఛగా నాపరాతి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ పొలం నుంచి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. విద్యుత్, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2 ఎకరాల భూమిలో ఇప్పటికే ఇప్పటికే ఎకరంన్నర కొల్లగొట్టారని, మరో అర ఎకరాలో రెండు రోజుల నుంచి తవ్వకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు.


సర్వే నంబర్ 110లో నాపరాతి తవ్వకాలు


అసైన్డ్‌భూమిలో భారీ యంత్రాలతో కొనసాగుతున్న తవ్వకాలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

సంగెంకలాన్ గ్రామ శివారు 110 పట్టా భూమి, 109 అసైన్డ్ భూమిలో నాపరాతి తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదే విషయం గురించి ఈ నెల 13న తహసీల్దార్ తారాసింగ్‌కు ఫిర్యాదు చేశాను. అక్రమ గనులపై విచారణ చేపట్టి, వ్యాపారులకు భారీ జరిమానా విధించాలి. లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. - మేఘనాథ్‌గౌడ్, మాజీ సర్పంచ్

చర్యలు తీసుకుంటాం



సర్వే నంబర్ 109 అసైన్డ్ భూమిని సాగుచేసుకుందుకు పేదలకు ఇచ్చాం. ఆ స్థలంతో తవ్వకాలు నిషేధం. అక్రమంగా నాపరాతి తవ్వకాలు జరుపుతున్నట్లు ఫిర్యాదు అందింది. క్షేత్రస్థాయిలో విచారణ చేపడతాం. చర్యలు తీసుకుంటాం. - తారాసింగ్, తహసీల్దార్, తాండూరు

ఉచ్చు బిగించి.. బండరాయితో మోది

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- నిందితులు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్


హత్యకు గురైన పార్వతమ్మ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: అప్పు ఇవ్వలేదన్న అక్కసుతో ఒంటరి మహిళపై ఇద్దరు వ్యక్తులు కక్ష పెంచుకున్నారు. మద్యం తాగించి, మెడకు టవల్‌తో ఉచ్చు బిగించి ఊపిరాడకుండా చేశారు. ఆపై బండరాయితో మోది కర్కశంగా హత్యచేశారు. ఈ సంఘటన ఈ నెల 16న కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో చోటు చేసుకుంది. హత్యకేసు మిస్టరీ వీడిన నేపథ్యంలో గురువారం ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ రాజేష్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం బొదనంపల్లి గ్రామానికి చెందిన వెంకటపురం పార్వతమ్మ(45) భర్త అంజయ్య ఐదేళ్ల క్రితం చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో ఆమె గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన అంజమ్మ, కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామానికి చెందిన యాదయ్యలతో పార్వతమ్మకు పరిచయం ఏర్పడింది. అది కాస్త యాదయ్యతో అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం పార్వతమ్మ.. తనకున్న వ్యవసాయ భూమిని విక్రయించి కందుకూరులో ఓ ఇంటిని కొనుగోలు చేసింది. బంగారు, వెండి ఆభరణాలు చేయించుకుంది. ఇది గమనించిన అంజమ్మ రూ.50వేలు అప్పు అడగగా.. అందుకు ఆమె నిరాకరించింది.

మద్యం తాగించి..

అప్పు ఇవ్వని పార్వతమ్మను అంతమొందించి, నగలు, నగదు అపహరించేందుకు అంజమ్మ, యాదయ్యలు కుట్రపన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న ఇద్దరు కలిసి పార్వతమ్మకు ఫోన్ చేసి, దావత్ చేసుకుందామని వేములనర్వకు పిలిపించారు. పథకం ప్రకారం ఆమెను గ్రామ శివారులోని లంబాయగుట్ట వేణుగోపాలస్వామి ఆలయ సమీపానికి అంజమ్మ తీసుకెళ్లగా.. వారి వెనకాలే యాదయ్య బైక్ పై మద్యం తీసుకొచ్చాడు. ముగ్గురు కలిసి మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న పార్వతమ్మ మెడకు టవల్‌తో ఊపిరాడకుండా చేశారు. బండరాయితో మోదీ హత్య చేశారు. మృతురాలి ఒంటిపై ఉన్న మూడున్నర తులాల బంగారు, రూ.50తులాల వెండి ఆభరణాలను తీసుకుని పరారయ్యారు. అపహరించిన సొత్తును షాద్‌నగర్ పట్టణంలోని బంగారు దుకాణంలో కుదవపెట్టి డబ్బులు తీసుకున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..

హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మూడున్నర తులాల బంగారు, 50 తులాల వెండి, రూ.1లక్ష 96వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించేందడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించి రివార్డు అందజేశారు. సమావేశంలో ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ కృష్ణయ్య, రాజ్‌కుమార్, సిబ్బంది బిక్షపతి, వేణుగోపాల్, శివకుమార్, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు


నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

కేశంపేట: హత్య కేసులో నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమాన విధిస్తూ.. గురువారం న్యాయమూర్తి హరీష తీర్పు నిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తొమ్మిదిరేకుల గ్రామ శివారు నాన్యతండా శివారులో 2021లో భూ తగాదాలో వాడ్యావత్ భాస్కర్, బాదావత్ రమేష్ గొడవ పడ్డారు. ఈ తగాదాలో రమేష్ రోకలితో భాస్కర్ తలపై దాడి చేయగా, రమేష్ తల్లి హేమ్లీ అసభ్య పదజాలంతో దూషించింది. ఈ విషయమై అప్పట్లో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేశారు. గాయపడిన భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆ కేసును హత్యాయత్నం కేసుగా మార్చారు. షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీసులు కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి సకాలంలో కోర్టుకు సమర్పించారు. జిల్లా 9వ అడిషనల్ కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమాన, అసభ్య పదజాలంతో దూషించిన హేమ్లీకి రూ.2వేల జరిమాన విధించినట్లు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ దుర్మరణం

పని ప్రదేశంలో వైరు సరిచేస్తుండగా ఘటన

చేవెళ్ల: విద్యుదాఘాతంలో ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా అనంతగిరిపల్లి గ్రామానికి చెందిన ఉమ్మెంతల నగేశ్(40) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ స్థానికంగా రంగారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. మూడు రోజులుగా భగత్‌సింగ్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో విద్యుత్ పనులను ఆయన చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వైర్ సరి చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి నగేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి చేవెళ్ల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.


నగేశ్ మృతదేహం

బాలాజీ సన్నిధిలో నటుడు విశ్వక్ సేన్

మొయినాబాద్: ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు విశ్వక్ సేన్ గురువారం కలియుగ దైవం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సాధారణ భక్తులతో కలిసి ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు విశ్వక్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న విశ్వక్ సేన్